ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 23 అక్టోబరు 2024

చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్ చెరువులో నీటమునిగిన వరిపంట



అనంత: మునిగిన కళాకారుల కాలనీ



- కనగానపల్లి చెరువు తెగడంతో వరద ఉధృతి
- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన భారీ వర్షాలు
- 370 హెక్టార్లల్లో రూ.2.32 కోట్ల పంట నష్టం


ఊరు.. ఏరు!

కాలనీలను ముంచెత్తిన పండమేరు

అనంతపురం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చీకటి పడ్డ తరువాత దంచికొట్టిన వాన.. తెల్లవారేలోగా కాలనీలను ముంచెత్తింది. అనంతపురంలో నాలుగు సెంటీమీటర్ల వర్షపాతానికి తోడు.. కనగానపల్లి చెరువు తెగిపోవడం, ఆ మండలంలో కురిసిన దాదాపు 20 సెంటీమీటర్ల కుండపోత పండమేరుకు చేరడంతో జనం బెంబేలెత్తిపోయారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పరిధిలోని జగనన్న కాలనీ, గురుదాస్ కాలనీ, ఆటోనగర్ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జగనన్న కాలనీలో నాలుగైదు అడుగుల ఎత్తువరకు నీరు చేరింది. గురుదాస్ కాలనీలో ఇళ్లు నీట మునిగాయి. అటవీ శాఖ వనమిత్ర వెనుక భాగంలో ఇటీవల వెలిసిన గుడిసెలు నీటిలో తేలియాడే కాగితపు పడవలను తలపించాయి. కొన్ని గుడిసెలు, వాహనాలు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. పదుల సంఖ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు మునిగిపోయాయి. నిత్యావసరాలు, దుస్తులు, సామగ్రి నీటిపాలయ్యాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది.



ఉప్పరపల్లి జగనన్న కాలనీ నుంచి ప్రజలను తరలిస్తూ..



పండమేరు పరుగులు..

రూ.2.32 కోట్ల పంటనష్టం

జిల్లాలో 370 హెక్టార్లల్లో రూ.2.32 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ పరిధిలో 10 మండలాల్లో 315 హెక్టార్లల్లో రూ.1.70 కోట్ల విలువైన వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యానశాఖ పరిధిలో ఏడు మండలాలలో 55 హెక్టార్లల్లో రూ.62.22 లక్షల విలువైన అరటి, మిరప, మామిడి, కళింగర, కర్బూజ, దానిమ్మ, చీనీ, టమోటా పంటలు దెబ్బతిన్నాయి.

రాకపోకలు బంద్

వేదవతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ సమీపంలో కాజ్‌వేపై వరద నీరు పొంగిపొర్లింది. దీంతో కళ్యాణదుర్గం-బళ్లారి మధ్య మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా రాకపోకలు నిలిచిపోయాయి. బొమ్మనహాళ్ మండలం కృష్ణాపురం, కొళగనహళ్లి గ్రామాల్లో వరి పంట దెబ్బతింది. మైలాపురం, కొత్తూరు, కానాపురం, ఏలంజి గ్రామాల్లో 300 ఎకరాలలో మొక్కజొన్న, పత్తి, జొన్న పంటలు నీట మునిగాయి. కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లిలో రైతు వెంకటేశులుకు చెందిన రెండెకరాల్లో మిరప పంట నీటమునిగింది.

కుండపోత వర్షం

అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి కుండపోత వర్షం పడింది. అత్యధికంగా కళ్యాణదుర్గంలో 89.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. కంబదూరు 65.4, ఆత్మకూరు 60.0, బుక్కరాయసముద్రం 55.0, నార్పల 48.2, రాప్తాడు 46.4, రాయదుర్గం 45.2, అనంతపురం 42.2 , బ్రహ్మసముద్రం 39.2, శింగనమల 32.4 , శెట్టూరు 31.8, గార్లదిన్నె 29.4, కూడేరు 28.4, బెళుగుప్ప 25.6, కుందుర్పి 24.6, డి. హిరేహాళ్ 24.0, కణేకల్లు 23.0, యల్లనూరు 21.2, తాడిపత్రి 13.6, పామిడి 13.4, ఉరవకొండ 12.4 , పుట్లూరు 12.2, బొమ్మనహాళ్ 5.4 , గుమ్మఘట్ట 4.8, పెద్దవడుగూరు 2.2, పెద్దపప్పూరు 1.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

(మరిన్ని వాన వార్తలు 6లో..)



బొమ్మనహాళ్ మండలం ఏళంజి గ్రామం వద్ద నీట మునిగిన మొక్కజొన్న పంట

అన్నా.. రైతులను ఆదుకోండి

మంత్రులకు పరిటాల సునీత ఫోన్

రాప్తాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని వ్యవసాయ, జలవనరుల శాఖ మంత్రులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విన్నవించారు. నియోజకవర్గంలోని వరద ముంపు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆమె పర్యటించారు. ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. వేలాది ఎకరాల్లో వరి, వేరుశనగ, టమోటా, ద్రాక్ష తదితర పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి ఫోన్ చేశారు. నష్టం వివరాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కనగానపల్లి చెరువు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రులు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. చెరువు మరమ్మతులకు ఆదేశాలిచ్చారని, పంట నష్టం అంచనా వేయించి.. పరిహారం ఇస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు.



ఇరిగేషన్ మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



ఉప్పరపల్లి జగనన్న కాలనీలో చిక్కుకున్న వరద బాధితులను రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చెరువులపై నిఘా వేయండి : కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో చెరువులపై నిఘా వేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆదేశించారు. ఉమ్మడి జిల్లాతో భారీ వర్షాలు కురిశాయని, చెరువులు నిండుతున్నాయని అన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని ఇళ్లలోకి నీరు చేరిందని, వరద నీటిలో చిక్కుకున్న 110 కుటుంబాలను రెవెన్యూ, పోలీసు అధికారులు కాపాడారని తెలిపారు. వారికి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 310 చెరువులు ఉన్నాయని, ఇందులో సగం చెరువులలో 50 శాతం నీరు ఉందని తెలిపారు. ప్రతి చెరువును వీఆర్‌ఓ, వీఆర్‌ఏ తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూం నుంచి జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. యల్లనూరు, కంబదూరు, నార్పల, కుందుర్పి మండలాల అధికారులను అప్రమత్తం చేశారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు అందుబాటులో ఉండాలని, వాగులు, వంకలు ప్రవహిస్తున్న రహదారుల వద్ద హై అలర్ట్ ప్రకటించాలని ఆదేశించారు. ఆ ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా చూడాలని అన్నారు. ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



నోటికొచ్చినట్లు మాట్లాడితే

సహించం

గోరంట్ల మాధవ్‌కు ఎంఎస్ రాజు వార్నింగ్



అనంతపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై ఆయన మండిపడ్డారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'పార్లమెంటు వ్యవస్థకు అప్రతిష్ఠ తెచ్చిన నీచుడు.. ఓ పిచ్చోడు ఈ జిల్లాలో ఉన్నాడు. చేసింది మరిచిపోయి సిగ్గు లేకుండా మీడియా ముందుకొచ్చి మాట్లాడుతున్నాడు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తున్నాడు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాధవ్ లాంటి వ్యక్తిని ఇంకా పార్టీలో కొనసాగిస్తున్న జగన్‌ను ఏమనాలో అర్థం కావడం లేదని అన్నారు. మహిళలను వేధించినవారిని జగన్ తన పార్టీలోనే కొనసాగిస్తారని అన్నారు. గంట, అరగంట అనే అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్‌పైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. హోంమంత్రి అనిత బాలకృష్ణకు పాదాభివందనం చేయడాన్ని హేళన చేస్తున్న మాధవ్‌కు సంస్కారం లేదని అన్నారు. బాలకృష్ణ తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు కుమారుడనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. తమకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన చంద్రబాబు, బాలకృష్ణ తమకు దేవుళ్లతో సమానమని అన్నారు. వారి ఆశీస్సులతోనే అనిత హోంమంత్రి అయ్యారని, తనలాంటి నిరుపేద దళితుడు ఎమ్మెల్యే అయ్యారని అన్నారు. అలాంటివారికి పాదాభివందనం చేస్తే మాధవ్‌కు వచ్చిన నొప్పేమిటని ప్రశ్నించారు. తమ సహనాన్ని పరీక్షించొద్దని, నోటికొచ్చినట్లు మాట్లాడితే చేతలు వేరే విధంగా ఉంటాయని హెచ్చరించారు.

నోరు అదుపులో పెట్టుకో మాధవ్

ఎమ్మెల్యే బండారు శ్రావణి



శింగనమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మచ్చ లేని నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణను విమర్శించే అర్హత మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు లేదని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. గోర్లంట మాధవ్ వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఎన్నికలలో వైసీపీ గాలికి కొట్టుకుపోయిందని, అందుకే మాధవ్‌కు పిచ్చి పట్టి గాలిమాటలు మట్లాడుతున్నారని అన్నారు. ఎంపీగా ఆయన చేసిన నీతిమాలిన పనికి ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వలేదని అన్నారు. ఐదేళ్లపాటు పురం ఎంపీగా ఉండి చేసిన అభివృద్ధి ఏమిటని ఆమె ప్రశ్నించారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నవారిని కూటమి ప్రభుత్వం వెంటనే అరెస్టు చేస్తోందని, కఠిన చర్యలు తీసుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలను ఎలా కాపాడుకోవాలో తమ ప్రభుత్వానికి తెలుసునని అన్నారు.

సాగు చేసిన అరటిపంట



అరటి అదుర్స్..!

రెండు నెలల్లో రెట్టింపు ధర
టన్ను రూ.30 వేల వరకూ...
మహారాష్ట్రలో దెబ్బతినడమే కారణం
జనవరి వరకూ ఇదే ధర ఉంటే చాలు
గట్టెక్కుతామని అంటున్న అన్నదాతలు

తాడిపత్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అరటి రైతులకు కాలం కలిసొచ్చింది. ఈ ఏడాది అరటికి లభించిన ధర మరే పంటకూ దక్కలేదు. రెండునెలల వ్యవధిలోనే ధర రెండింతలైంది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రికార్డుస్థాయి ధర పలుకుతోంది. జూలైలో టన్ను రూ.15 వేల నుంచి రూ.18 వేలు పలికింది. ప్రస్తుతం రూ.26 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. దాదాపు 35 ఏళ్లుగా ఈ ధర చూడలేదని రైతులు చెబుతున్నారు. ధర నిలకడగా ఉండడం కూడా రైతులకు మేలుచేస్తోంది. ఇన్నాళ్లూ అరకొర ఆదాయం, అప్పులతో అరటిని సాగుచేసిన రైతులకు ఇన్నాళ్లకు కాలం కలిసొచ్చింది. రెండో పంటకూ ఊహించినదానికంటే ఎక్కువగానే ధర లభిస్తోందని రైతులు అంటున్నారు.

అక్కడ దెబ్బతినడంతో..

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో అరటిపంట బాగా దెబ్బతింది. దీంతో జిల్లాలో అరటి ధర విపరీతంగా పెరిగింది. ధర, డిమాండ్ పెరగడానికి మహారాష్ట్రలో పంట దెబ్బతినడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అధిక వర్షాలు, వాతావరణ పరిస్థితుల ప్రభావం, తెగుళ్ల తదితర కారణాల వల్ల మహారాష్ట్రలో పంట ఎక్కువశాతం దెబ్బతినింది. అరకొరగా పండిన పంట సైతం నాణ్యత లోపించడంతో వ్యాపారులు అక్కడ కొనుగోలు చేయడానికి ఇష్టపడటంలేదు. దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యాపారులు తెలుగు రాష్ట్రాల్లో అరటిపై పడ్డారు. దళారుల ద్వారా ధరను నిర్ణయించి, కొనుగోలు చేసి తమ మార్కెట్లకు తరలిస్తున్నారు. తాడిపత్రి ప్రాంతం నుంచి ఎక్కువగా ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలకు అరటి తరలుతోంది.

6,500 వేల హెక్టార్లలో..

తాడిపత్రి ప్రాంతంలో 6,500 వేలకు పైగా హెక్టార్లలో అరటిసాగులో ఉంది. పుట్లూరు మండలంలో అత్యధికంగా 3200 హెక్టార్లలో అరటి పంట పెట్టారు. యల్లనూరు మండలంలో 1400 హెక్టార్లు, యాడికి మండలంలో 600 హెక్టార్లు, పెద్దపప్పూరు మండలంలో 1200 హెక్టార్లలో అరటి పంట సాగులో ఉంది.



విరగ్గాసిన అరటి గెలలు


నెల ఆగితే..



15 ఎకరాల్లో అరటి పంటను సాగుచేశాను. నాలుగు ఎకరాల్లో రెండో పంట చేతికి రావడానికి నెలరోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ధర బాగా ఉంది. ఇదే ధర నెలరోజుల తర్వాత ఉంటే మాకు మేలు జరుగుతుంది. మిగిలిన 11 ఎకరాల్లో పంట జనవరికి కోతకు వస్తుంది.

- తాతిరెడ్డి దామోదర్‌రెడ్డి, ముచ్చుకోట, పెద్దపప్పూరు మండలం

జనవరి వరకూ ఆగాలి..



మూడెకరాల్లో అరటిపంటను సాగుచేశాను. కొన్నేళ్లుగా సరైన ధర లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాను. ఈ సారి ధర బాగా ఉంది. పంట ఇంకా చేతికి రాలేదు. మరో నాలుగు నెలల సమయం పట్టవచ్చు. అంతవరకు ఇదే రేటు కొనసాగుతుందా లేదో తెలియదు. ఇదే ధర ఉంటే మాత్రం అప్పులు తీరుతాయి.

- థామస్‌రెడ్డి, దిగువపల్లి, తాడిపత్రి మండలం

పది ఎకరాల్లో సాగుచేశా..



పది ఎకరాల్లో అరటి పంటను సాగుచేశాను. ఈ నెలలో కొంత చేతికి వస్తుంది. మిగిలిన పంట జనవరిలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ధర బాగున్నా.. కొంత పంట మాత్రమే చేతికి వస్తుంది. జనవరిలో కూడా ఇదే ధరలు కొనసాగితే మంచి లాభాలు చూడవచ్చు.

- గోవర్ధన్‌రాజు, కడవకల్లు, పుట్లూరు మండలం

సరస్వతీ నిలయాలకు లక్ష్మీకళ

1,637 స్కూళ్లకు రూ. 2.68 కోట్ల గ్రాంట్



కూటమి ప్రభుత్వం ఉత్తర్వులపై హర్షం

అనంతపురం విద్య, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సరస్వతీ నిలయాలకు లక్ష్మీ కళ వచ్చింది. మూడేళ్లుగా కళావిహీనంగా ఉన్న పాఠశాలలకు కూటమి ప్రభుత్వం భారీగా గ్రాంట్స్ విడుదల చేసింది. వైసీపీ హయాంలో మూడేళ్లపాటు పాఠశాలలకు గ్రాంట్స్ ఇవ్వలేదు. ఎమ్మార్సీలకు సైతం చిల్లిగవ్వ ఇవ్వలేదు. దీంతో సుద్ద ముక్క, పేపర్లను కొనాలన్నా ఉపాధ్యాయులు సొంత డబ్బులను వెచ్చించాల్సి వచ్చింది. ఈ దుస్థితి నుంచి తప్పించేందుకు కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాలుగు నెలల్లోనే చర్యలు ప్రారంభించింది. పాఠశాలలు, ఎమ్మార్సీలకు భారీగా నిధులు విడుదల చేసింది. కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ కింద 1637 స్కూళ్లకు 50 శాతం, ఒక్కో ఎమ్మార్సీకి రూ.1.30 లక్షల చొప్పున నిధులు ఇచ్చింది. స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైమరీ, సెకెండరీ, సీనియర్ సెకెండరీ స్కూళ్లకు, ఎమ్మార్సీ కేంద్రాలకు 2024-2025 విద్యా సంవత్సరానికి ఈ నిధులు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1637 స్కూళ్లకు రూ.5.36 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా.. అందులో 50 శాతం రూ.2.68 కోట్లు విడుదల చేశారు. ఒక్కో ఎమ్మార్సీ నిర్వహణ కోసం గ్రాంట్ రూ.30 వేల గ్రాంట్, రూ.40 వేలు కంటింజెన్సీ , రూ.30 వేలు టీఎల్‌ఎం గ్రాంట్, రూ.30 వేలు మీటింగ్ టీఏ.. అన్నీ కలిపి రూ.1.30 లక్షలు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లోని ఎమ్మార్సీలకు రూ.40.30 లక్షలు విడుదల చేశారు.


టీచర్లు, ఎంఈఓల్లో ఆనందం

జగన్ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన గ్రాంట్స్‌ను సైతం మింగేసింది. కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కలిపి పాఠశాలలు, ఎమ్మార్సీలకు నిధులు ఇవ్వాలి. కానీ గత మూడేళ్ల స్కూల్ గ్రాంట్స్, ఎమ్మార్సీ గ్రాంట్స్ రూపాయి కూడా ఇవ్వలేదు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఏడాదికి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకూ ఏదో రకంగా ఖర్చు అవుతుంది. ఇదంతా ఉపాధ్యాయులే భరించాల్సి వచ్చింది. ఎమ్మార్సీలలో డబ్బులు లేక ఎంఈఓలు సైతం అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, ఎంఈఓలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీలకు ఈ నిధులు విడుదల చేశారు. అక్కడి నుంచి పాఠశాలలు, ఎమ్మార్సీలకు నిధులు వస్తాయి.



ఆకాశపు హరివిల్లుపై అవని ఎక్కుపెట్టిన శరం.. అనంతపురం క్లాక్ టవర్..!

ఆకాశంలో కొంత.. అంబేడ్కర్ ఫ్లై ఓవర్‌పై కొంత.. అనంతపురం నగర సుందరీకరణ



■ సొగసు చూడ తరమా..!

అనంతపురం నగరంలో మంగళవారం ఉదయం కనిపించిన దృశ్యాలు



రాప్తాడు మండలంలో నీట మునిగిన వరి పైరు





టీవీ టవర్ ఆటోనగర్ వద్ద ఇళ్లు నీట మునగడంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు



ఉప్పరపల్లి జగనన్నకాలనీలో ఓ కొట్టంపై సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుడు



నీట మునిగిన ఉప్పరపల్లి జగనన్న కాలనీ



నిండు కుండలా బండమీదపల్లి చెరువు

100 ఎకరాలకు పైగా నష్టం

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు, కాలువలు మరువ పారుతున్నాయి. బండమీదపల్లి చెరువు నిండి మరువ పారుతోంది. నీరు అధికం కావడంతో మరువ వద్ద కట్ట కోతకు గురైంది. దీంతో మరువ నీరు పంట పొలాలపై ప్రవహించాయి. చీనీ చెట్లు, వరి పొలాలపై నీరు ప్రవహించడంతో వరి పొలాలు నీట మునిగాయి. వంద ఎకరాలకు పైగా నష్టం వాటిల్లింది.

- బండమీదపల్లి గ్రామంలో సల్లాపురమ్మ ఆలయ పూజారి నారాయణప్పకు చెందిన 80 మేకలు నీటిలో మునిగి మృతి చెందాయి. కొన్ని మేకలు గల్లంతయ్యాయి.



రాప్తాడు మండలంలో వాన నీటితో నిండిపోయిన చీనీ తోట



బండమీదపల్లిలో మృతి చెందిన మేకలు

జిల్లాలో భారీ వర్షం

అతలాకుతలం

తెగిన కనగానపల్లి చెరువు
నీట మునిగిన పంటలు, ఇళ్లు
భారీగా పంట, ఆస్తి నష్టం
పరిశీలించిన అధికారులు

అనంతపురంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కుంభవృష్టి కురిసింది. రాప్తాడు మండలంలోని బండమీదపల్లి చెరువు నిండి పొంగి పొర్లడం, కనగానపల్లి చెరువుకు గండిపడటంతో పండమేరు వంక ఉగ్రరూపం దాల్చింది. దీంతో రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఉప్పరపల్లిలోని జగనన్న కాలనీ, గురుదాస్ కాలనీ, ఆటోనగర్ కాలనీలు నీటమునిగిపోయాయి. జగనన్న కాలనీలో దాదాపు నాలుగైదు అడుగుల ఎత్తువరకు నీరు వచ్చిచేరాయి. నగరశివారు అటవీ శాఖ వనమిత్ర వెనుకభాగంలో గుడిసెలన్నీ నీట మునిగి కొట్టుకుపోయాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు మునిగిపోయాయి. కొన్ని వాహనాలు కొట్టుకుపోయాయి. ఆయా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి, ధాన్యం గింజలు, దుస్తులు ఇతరత్రవన్నీ నీటిలో మునిగిపోయాయి.

అప్రమత్తమైన అధికారులు..

ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని కాలనీలు నీటి మునిగిన విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు తమ సిబ్బందితో ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. నీటమునిగిన ప్రాంతాల్లో ఉండిపోయిన ప్రజలను స్థానికుల సాయంతో జేసీబీలతో బయటకు తీసుకొచ్చారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస ప్రదేశాలకు తరలించారు. గ్రామంలోని వీరనాగమ్మ గుడి, ప్రభుత్వ పాఠశాల, ఆర్డీటీ స్టేడియం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో భోజనం ఇతరత్ర సౌకర్యాలు కల్పించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమేరకు మంగళవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలైన ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని కాలనీల్లో ఆయన పర్యటించారు. పరిస్థితిని అధికారులతో సమీక్షించి, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

దెబ్బతిన్న పంటలు..

భారీగా కురిసిన వర్షానికి మండలంలోని పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. ఉప్పరపల్లితో పాటు సోములదొడ్డి, పాములాయి, కందుకూరు, మన్నీల, చియ్యేడు, ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఎక్కువశాతం వరి పంట నెల కొరింది. మన్నీల, చియ్యేడు, కందుకూరులో వేరుశనగ పంట నీటమునిగింది. మండల వ్యాప్తంగా వరి 22హెక్టార్లు, వేరుశనగ 15హెక్టార్లలో దెబ్బతినట్లు ఏఓ శశికళ తెలిపారు.



నీట మునిగిన జగనన్న కాలనీ



ఎక్స్‌కవేటర్‌లో ఒడ్డుకు ముంపు బాధితులు



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ, పరిటాల శ్రీరామ్

రికార్డుస్థాయిలో వర్షం



తెగిన కనగానపల్లి చెరువుకట్ట



కుర్లపల్లిలో వరదనీటికి కొట్టుకుపోయిన వేరుశనగ

కనగానపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో 19 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. మండలంలోని ముత్తవకుంట్ల, ముక్తాపురం, తగరకుంట, తల్లిమడుగుల తదితర చెరువులన్నీ మరువ పారాయి. కనగానపల్లి చెరువు కట్ట పూర్తిగా తెగిపోవడంతో నీరంతా పంట పొలాల మీదుగా ప్రవహించింది. మండల వ్యాప్తంగా 200 ఎకరాల్లో వరి, 200 ఎకరాలలో వేరుశనగ, వంద ఎకరాల్లో టమోట, 300 ఎకరాల్లో ఇతర పంటలు భారీగా దెబ్బతిన్నాయి. తగరకుంటలో 5 ఇళ్లు, కనగానపల్లిలో 18 ఇళ్లు దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు. మామిళ్లపల్లి తలిపిరి వద్ద అచ్చంపల్లికి చెందిన టమోటా లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వరదలో కొట్టుకుపోయింది. అందులో ఉన్న దాదాపు 250 టమోటా బాక్సులు నీటమునిగాయి. కనగానపల్లిలో చెరువుతెగిపోయిందన్న సమాచారంతో ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ రమాదేవి ఇతర అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే చెరువుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు.

స్తంభించిన రాకపోకలు

కాగా ముక్తాపురం చెరువు మరువ పారి జాతీయ రహదారిపైకి నీరు రావడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మామిళ్లపల్లి పెద్దవంక పారడం, కనగానపల్లి పండమేరు వంక పొంగిపొర్లడంతో కనగానపల్లి, ధర్మవరం మధ్య ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

వైసీపీ వల్లే ఈ దుస్థితి: పరిటాల సునీత

కనగానపల్లి చెరువు తెగిందన్న సమాచారంతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అక్కడకు చేరుకున్నారు. అక్కడ తెగిన కట్టను, పంట నష్టాన్ని పరిశీలించారు. వెంటనే ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడుకు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువుల మరమతులు, కాలువ పనులు చేపట్టకపోవడంతోనే ఇప్పుడు ఇంతటి నష్టం జరిగిందని విమర్శించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

మరువ పారిన చెరువులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. వరి, టమోట, వేరుశనగ, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. హరియన్ చెరువులో 60 ఎకరాలకు పైగా వరి నీట మునిగింది. ముష్టికోవెల, న్యామద్దల, హరియన్‌చెరువు చెరువులు మరువ పారడంతో ఈ పరిస్థితి సంభవించిందని రైతులు పేర్కొన్నారు. చిత్రావతి, వంగపేరు నది ఉధృతి కారణంగా ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారిపై మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. సీకేపల్లి, నామాల, న్యామద్దల, హరియన్‌చెరువు తదితర గ్రామాలలో వంకలు భారీగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



చిన్నమొగలాయపల్లిలో నీటమునిగిన టమోటా

పంటలకు అపార నష్టం



కొట్టుకుపోయిన పోలేపల్లి-అక్కంపల్లి రోడ్డు

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి 98.5మి.మీ వర్షపాతం కురిసింది. ఈ వర్షానికి పోలేపల్లి, అక్కంపల్లి, కుంటిమద్ది, శ్రీహరిపురం, సుద్దకుంటపల్లి తదితర గ్రామాలలో వరి, వేరుశనగ, టమోట, ఆముదం పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆయా గ్రామాలకు వెళ్లి నష్టపోయిన వారికి ధైర్యం చెప్పారు. కుంటిమద్ది చెరువు నుంచి భారీగా వరద ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 60 ఎకరాలలో పంట నీట మునిగినట్టు అధికారులు తెలిపారు. అక్కంపల్లి, పోలేపల్లి గ్రామాలకు చెందిన నారాయణ, జనార్దన్ నాయుడు, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తికి చెందిన దాదాపు 250 బస్తాలు వేరుశనగకాయలు వర్షానికి కొట్టుకుపోయాయి.



నీటిపాలైన వేరుశనగ

మరో మూడు రోజులు వానలు




బుక్కరాయసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయం, ఉద్యాన పంటలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటలను ఆశించిన చీడ పురుగుల నివారణకు పురుగుమందులు పిచికారీ చేయడాన్ని మూడు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు సూచించారు. ఉద్యాన, వ్యవసాయ పంటలకు సంబంధించి తక్షణమే వ్యవసాయ సలహాలు పాటించాలని సూచించారు. అధిక వర్షాలు వలన ముంపునకు గురి అయిన తోటల్లో మురుగు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. కోత కోసిన పంటను భద్ర పరుచుకోవాలని సూచించారు. అరటి, టమాటా పంటలు గాలి, వానకు పడిపోకుండా ఊతం ఇవ్వాలన్నారు. కూరగాయల పంటలకు వర్షాలు నిలిచిన అనంతరం ఫార్ములా- 4 లేదా పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పూత దశలో ఉన్న కందిలో మచ్చల పురుగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం శనగ సాగు చేసే రైతులు అక్టోబరు రెండో పక్షం నుంచి నవంబరు మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చని సూచించారు.

హంద్రీనీవా కాలువకు గండి



హంద్రీనీవా కాలువకు పడిన గండి

సోమందేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచేపల్లి సమీపాన మంగళవారం హంద్రీనీవా కాలువకు గండిపడింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లడంతో హంద్రీనీవా కాలువలోకి పెద్దఎత్తున నీరు చేరింది. మంచేపల్లివద్ద కాలువకు గండిపడింది. నీరు మంచేపల్లి, పందిపర్తి చెరువులకు చేరుతోంది. గ్రామస్థులు.. అధికారులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే రెండు చెరువులు నిండి మరువలు పారడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మంచేపల్లి చెరువు మరువ నీరు ఈదులబళ్లాపురం చెరువుకు చేరుతున్నాయి. సమాచారం అందుకున్న అధికారులు ఆగమేఘాలపై ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువ గండిని పూడ్చే క్రమంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై సమీక్షించారు. గ్రామంలోకి నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు.

సీబీఆర్‌కు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నేడు గేట్లు ఎత్తే అవకాశం

తాడిమర్రి మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం ఉదయానికి ఇన్‌ఫ్లో 5వేలు ఉండగా.. సాయంత్రానికి అది 10వేలకు పెరిగినట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం మొత్తం 9.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.7 టీఎంసీల నిల్వఉంది. ఇన్‌ఫ్లో బుధవారం వరకు కొనసాగితే 10 గంటలకు రెండు గేట్లు ఎత్తి, నీటిని నదికి వదులుతామని అధికారులు తెలిపారు. దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి, యల్లనూరు మండలం లక్షుంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నదిలోకి ఎవరూ దిగరాదని ఈఈ సూచించారు.

మర్తాడులో వర్షానికి నేలవాలిన వరిపంట



122 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

గార్లదిన్నె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి 30 మి.మీటర్ల వర్షం కురిసింది. దీంతో వరి, పత్తి, వేరుశనగ తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. మొత్తం 47 మంది రైతులకు చెందిన 159 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అధికంగా వరి పంట దెబ్బతింది. 122 ఎకరాలలో వరి, 11 ఎకరాలలో వేరుశనగ, 22 ఎకరాలలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఉదయం వ్యవసాయ అధికారి సోమశేఖర్, సిబ్బంది పంటలను పరిశీలించారు.

సంక్షిప్తం

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.33, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన తెలిపారు.

రిజర్వాయర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మంగళవారం 1295 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1165 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటినిల్వ ఉందన్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్‌లో నవంబరు 14నుంచి, జర్దోసి మగ్గం వర్క్‌లో 15నుంచి, టైలరింగ్‌లో 18వతేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగిన 19-45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం, అనంతరం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 8309915577, 9618876060, 9440905479ను సంప్రదించాలని ఆమె కోరారు.

'దరఖాస్తు చేసుకోండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నవంబరు 24న నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఆయన మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 480 మార్కులు, ప్రైవేట్ పాఠశాలలో 520 సాధించి ఉండాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన వారు 850, ప్రైవేట్ కళాశాలలో 900 మార్కులు సాధించిన జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులు అర్హులన్నారు. నవంబరు 15లోగా దరఖాస్తులను 'శ్రీనివాసులు, డోర్ నంబరు 18-1-406, వేణుగోపాల్‌నగర్, పాతూరు, అనంతపురం' చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9440501463, 9441222874కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు శివప్రసాద్ పాల్గొన్నారు.

డ్రస్‌మేకింగ్ కోర్సుకు అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలికల ఐటీఐలో డ్రస్‌మేకింగ్ కోర్సుకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఐటీఐల జిల్లా కోఆర్డినేటర్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఫెయిల్/పాస్ అయిన బాలికలు అర్హులన్నారు. ఈనెల 26 లోగా ఏపీ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న బాలికలు ఈ నెల 28న వారి సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నేడు ఇన్‌చార్జ్ సీసీఎఫ్ సెల్వం రాక

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్కిల్ ఇన్‌చార్జ్ సీసీఎఫ్ సెల్వం బుధవారం రానున్నారు. ప్రస్తుతం ఉన్న సీసీఎఫ్ యశోదాబాయి బాధ్యతలు చేపట్టిన వెంటనే శిక్షణ నిమిత్తం వెళ్లారు. దీంతో తిరుపతి సర్కిల్ సీ సీఎఫ్ సెల్వం కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన బుధవారం రానున్నారు. ఆయన గురువారం ఎన్ఆర్‌జీ ఎస్ స్కీమ్ అమలుపై అనంతపురం సర్కిల్ సిబ్బందితో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి చర్చించనున్నారు.

రెండు రైళ్ల రద్దు

గుంతకల్లు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): దానా తుపాను కారణంగా అనంతపురం మీదుగా వెళ్లే బెంగళూరు-హౌరా-బెంగళూరు అప్ అండ్ డౌన్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-భువనేశ్వర్ (రైలు నం. 18464)ను ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 18463)ను 24న రద్దు పరచినట్లు తెలియజేశారు.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక రద్దు

జిల్లాలోని రాయదుర్గం-కదిరిదేవరపల్లి రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న యార్డు ఆధునికీకరణ పనుల కారణంగా తిరుపతి ప్యాసింజరును పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 07589) రైలును నవంబరు 1 నుంచి 30 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07590)ను నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచి, గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు. అలాగే రైల్వే మెయింటెనెన్స్ వర్కుల కారణంగా గుత్తి మీదుగా వెళ్లే కాచిగూడ-తిరుపతి (నం. 07063) ప్రత్యేక రైలును ఈ నెల 29, నవంబరు 5, 12 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07064)ను ఈ నెల 30న, నవంబరు 6, 13 తేదీల్లోనూ రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఊరిబడికి ప్రాణం..!

జీఓ 117 రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం

సర్వత్రా హర్షం


వృథాగా ఉన్న తరగతి గదులు

కదిరి మండలంలోని పట్నం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 170 మంది విద్యార్థులు గతంలో చదువుకునేవారు. గత వైసీపీ పాలనలో పాఠశాలల విలీనం తరువాత 1, 2 తరగతులకు చెందిన 19 మంది మాత్రమే మిగిలారు. వీరికి ఒక ఉపాధ్యాయుడున్నారు. పాఠశాలలో 16 గదులు ఉండగా, కొన్ని వృథాగా మారాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓతో ఈదుస్థితి ఏర్పడింది.



పట్నం ప్రాథమిక పాఠశాల

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 117ను వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేయాలని నిర్ణయించింది. పాఠశాలలో తరగతుల విలీనం, ఉపాధ్యాయుల సర్దుబాటు, ప్రాథమిక స్థాయిలో 20 మందికి ఒక ఉపాధ్యాయుడు లాంటి వాటిని అమలు చేస్తూ ఈ జీఓను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దాని అమలులో భాగంగా మార్పులు చేపట్టింది. పాఠశాలలను విలీనం చేయడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైంది. ప్రస్తుతం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వివాదాస్పద జీఓ రద్దుకు నిర్ణయించింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వేలల్లో తగ్గిన విద్యార్థులు

విలీన ప్రక్రియతో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు మందగించడం చాలాచోట్ల 1, 2 తరగతులు మాత్రమే నిలిచాయి. 3, 4, 5 తరగతులు విలీనమైనచోట్ల సరిపడా గదులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దూరంగా ఉండే పాఠశాలలకు పంపించడం ఇష్టంలేని తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. విలీన ప్రక్రియతో విద్యావ్యవస్థ నాశనం కావడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. అయినా గత వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఎక్కువగా జీఓ 117కు సంబంధించిన వినతులే అందాయి. ఈనేపథ్యంలో ప్రాథమిక విద్యను దెబ్బతీసే జీఓ 117ను రద్దు చేస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గాడితప్పిన వ్యవస్థను సరైన మార్గంలోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు జీవం

ప్రభుత్వ బడులకు ప్రతిబంధకంగా ఉన్న జీఓ 117ను రద్దు చేయడంద్వారా కూటమి ప్రభుత్వం పాఠశాలకు జీవం పోసింది. విలీన సమస్యలు నాలుగేళ్లుగా ఉపాధ్యాయులను వెంటాడుతున్నాయి. జీఓ రద్దుతో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతమవుతుంది. హామీ అమలు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- చింతా నాగరాజు, ఉపాధ్యాయుడు, కదిరి



విలీనంతో గందరగోళం

ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసేందుకు అమలు చేసిన 117 జీఓతో గందరగోళం ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. జీఓను రద్దు చేస్తే బడులకు పూర్వవైభవం వస్తుంది.

- క్రిష్ణమోహన్, ఉపాధ్యాయుడు, కదిరి

నిరీక్షణకు తెర

పీఆర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం అండ

58 మందికి జీతాల భద్రత

పీఆర్ నుంచి డ్వామాకు బదలాయింపు

18 నెలల వేతన బకాయిలు మంజూరు


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిరీక్షణ ఫలించింది. వేతన బకాయిలు విడుదలయ్యాయి. దీంతో పంచాయతీ రాజ్ శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. గత 16 ఏళ్ల నుంచి నెల నెలా సక్రమంగా జీతాలు రాక, ఇబ్బంది పడిన వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. జీతాల సమస్య పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీసుకెళ్లారు. వెంటనే డిప్యూటీ సీఎం స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఫలితంగా పీఆర్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ గ్రామీణాభివృద్ధి శాఖలోని డ్వామాలోకి బదలాయించారు. దీంతో పాటు అక్కడి నుంచే ప్రతి నెలా జీతాలు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక 18 నెలల వేతన బకాయిలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.25 కోట్లను మంజూరు చేశారు. దీంతో ఇకమీదట ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు వస్తాయని ఆ చిరుద్యోగులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ధ్రువపత్రాల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఏమాత్రం ఆలస్యంగా కాకుండా డ్వామా, పీఆర్ అధికారులు కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 02 ఆఫీస్ సబార్డినేట్‌లు, 34మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు మొత్తంగా 58 మందికి సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. అనంతపురం జిల్లాలో 42మంది ఉద్యోగులకు స్థానిక డ్వామా సమావేశ మందిరంలో ధ్రువపత్రాల పరిశీలన చేశారు. డ్వామా హెచ్ఆర్ మేనేజర్ గీతా, సూపరింటెండెంట్‌లు శశికళ, శైలజ, పీఆర్ డీఈఈ గురుమూర్తిరాజు, డీపీఓ లక్ష్మీదేవి తదితర అధికారులు ధ్రువపత్రాలను పరిశీలించారు. డ్వామా పరిధిలోని ఎన్ఐసీ పోర్టల్ ద్వారా సమగ్ర వివరాలను అప్‌లోడ్ చేసి అప్కాస్ కిందికి వీరందర్నీ తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు ఒక్కొక్కర్ని కేటాయించారు. మొత్తంగా పీఆర్ నుంచి డ్వామాకు బదలాయించడంతో జీతాలకు భద్రత కలిగింది.



చుక్కలు చూపిన వైసీపీ సర్కార్

2009 నుంచి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 598మంది ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నాం. మొదట్లో మాకు జీతాలు బాగానే ఇచ్చేవారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా మాకు కష్టాలే. గత వైసీపీ సర్కార్ ఐదేళ్ల పాలనలో మాకు చుక్కలు చూపించారు. ఉద్యోగ భద్రత పక్కన పెడితే కనీసం జీతాలను కూడా ఇవ్వలేదు. గత సీఎంతో పాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినా ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ఆర్టీలు అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి మా సమస్యను విన్నవించాం. వెంటనే పరిష్కారించి మాకు అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది.

- నరేష్‌బాబు (డేటాఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు)



డిప్యూటీ సీఎంకి రుణపడి ఉంటాం

మా సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి తిరిగినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వాలు మారినా మాకు న్యాయం జరగలేదు. కూటమి అధికారంలోకి రాగానే.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నెలల వ్యవధిలోని మా సమస్యను పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు రుణపడి ఉంటాం.

- కిరణ్ (టెక్నికల్ అసిస్టెంట్, జోనల్ సెక్రటరీ)



ఉద్యోగులకు అండగా నిలిచినట్లే

పంచాయతీ రాజ్‌శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. ఉద్యోగ భద్రతతో పాటు 18 నెలల వేతన బకాయిలు మంజూరు చేయడం చూస్తే.. వారందరికి ప్రభుత్వం అండగా నిలిచినట్లుగా అనిపిస్తోంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, ఉమ్మడి జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖ.

హామీని నెలబెట్టుకోండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో పదివేల క్యూసెక్కుల నీరు పారిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శ రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని మంత్రి కేశవ్, ఇరిగేషన్ అధికారులకు సూచించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డిస్ట్రిబ్యూటరీలతో పాటు ప్రధాన కాలువపైన దృష్టి సారించాలని కోరారు. కాలువలో పదివేల క్యూసెక్కుల నీరు పారించగలిగితే 3.5లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి జిల్లాను సస్యశామలం చేయవచ్చునన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2021లో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, 6300క్యూసెక్కుల నీటిని తీసుకువస్తామని జీవో ఇచ్చినా ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ చేయకపోవడం వల్ల డ్యాంలో నీళ్లు ఉన్నప్పటికీ కూడా అదనంగా నీరు తీసుకోలేకపోతున్నామన్నారు. వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు, కుంటలు తెగిపోయాయని, వాటి మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, శీనప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘర్షణ.. అనంతరం మృతి


మల్లికార్జున (ఫైల్)

బుక్కరాయసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగదు లావాదేవీ విషయంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన అనంతరం మల్లికార్జున(45) మృతి చెందాడు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు... కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జునకు గోవిందంపల్లి గ్రామ పంచాయతీలోని బీజేపీ కాలనీకి చెందిన రఫీ రూ.40వేలు అప్పు ఇచ్చాడు. ఈ డబ్బు విషయంగా ఇద్దరి మధ్య మంగళవారం వాగ్వాదం జరిగింది. దీనిపై పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. పంచాయితీ జరుగుతుండగానే మల్లికార్జున, రఫీ కొట్టుకున్నారు. వారి గొడవను పెద్ద మనుషులు ఆపారు. అనంతరం మల్లికార్జున కుప్పకూలిపోయాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. గొడవలో రఫీ కొట్టిన దెబ్బలకు మృతి చెందడా? లేదా అనారోగ్యం రీత్యా మృతి చెందడా? అన్న విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరుణాకర్ అనంతపురం సర్వజన ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పెద్దమనుషుల పంచాయితీ, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

శివరాంపేట సమీపంలో..


మృతి చెందిన అశోక్, వినోద్

కూడేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన అశోక్ (21), నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం, మహిమలురూ గ్రామానికి చెందిన వినోద్ (27) మృతి చెందిన వారిలో ఉన్నారు. కూడేరుకు చెందిన దామోదర్ తీవ్రంగా గాయపడ్డారు. దామోదర్, వినోద్ ఇద్దరు మండల సమీపంలోని సుజలాన్ కంపెనీలో పనిచేస్తున్నారు. అశోక్ అనంతపురంలో వుడ్ వర్క్ చేసేవాడు. ప్రతి రోజు దామోదర్, వినోద్‌లిద్దరు కంపెనీలో పని ముగించుకొని కూడేరుకు వచ్చేవారు. అశోక్ కూడా అనంతపురంలో పని ముగించుకొని కూడేరు మీదుగానే స్వగ్రామానికి వెళ్లేవాడు. ఈక్రమంలో ముగ్గురు మంచి స్నేహితులయ్యారు. సోమవారం ద్విచక్ర వాహనంపై ముగ్గురూ కూడేరు నుంచి ఉరవకొండకు బయల్దేరారు. శివరాంపేట గ్రామం దాటిన తర్వాత మలుపువద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి, కింద పడ్డారు. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అశోక్, వినోద్ మృతి చెందారు. దామోదర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాలను పోస్టుమార్టంకు తరలించారు.

ఎంత ఘోరం చేశావు దేవుడా...

నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన వినోద్ కూడేరులో అద్దె గదిలో ఉంటూ సమీపంలో సుజలాన్ కంపెనీలో పని చేసేవాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి తల్లి పావని గుండెలవిసేలా మృతదేహంపై పడి రోదించింది. ఎంత ఘోరం చేశావు దేవుడా..! కుటుంబ జీవనానికి ఆధారంగా ఉంటున్న బిడ్డను మాకు దూరం చేశావా? ఇప్పటికే భర్తను తీసుకెళ్లావు. ఇప్పుడు కొడుకుని కూడా దూరం చేశావు ఇంక మాకు దిక్కెవరు అంటూ కన్నీరు మున్నీరు అయ్యింది. ఆమెను ఓదార్చడం బంధువులకు సాధ్యం కాలేదు.

ఢిల్లీలో అవార్డు అందుకున్నారు


అవార్డు అందుకుంటున్న వాటర్‌షెడ్స్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, హంపాపురం సర్పంచు లక్ష్మీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జలసంరక్షణలో ఉత్తమ ఫలితాలు సాధించిన హంపాపురం గ్రామ పంచాయతీ వాటర్‌షెడ్ జాతీయ స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కేంద్రజలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా డ్వామా వాటర్ షెడ్స్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, హంపాపురం గ్రామ పంచాయతీ సర్పంచు లక్ష్మీదేవి అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల డ్వామా, వాటర్‌షెడ్స్ ఉద్యోగులు, హంపాపురం గ్రామ పంచాయతీ ప్రజలు అభినందనలు తెలిపారు.

ఊరికి దారేది..!

నేటికీ రోడ్డులేని చాపర్లపల్లి బీసీ కాలనీ

మురుగు కాలువపై నుంచి వెళ్లాల్సిందే..


రోడ్డులేక డ్రైనేజీ గుండా వెళ్తున్న కాలనీ వాసులు

మడకశిర రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలోనూ ఓ ఊరికి దారి లేదంటే నమ్మగలమా. అయినా వాస్తవం. మండలంలోని చాపర్లపల్లి బీసీ కాలనీకి రోడ్డులేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 90 ఇళ్లు, 290 మంది జనాభా ఉంటోంది. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లడానికి దారిలేదు. డ్రైనేజీ నుంచే వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రిపూట ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే వారు పడే బాధలు అన్నీఇన్నీ కావు. మారుమూల గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవనడానికి చాపర్లపల్లి బీసీ కాలనీయే నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు

శ్రీనివాసులురెడ్డి, చాపర్లపల్లి గ్రామం



గత ఐదేళ్లలో కాలనీకి రోడ్డు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు వేయించాలి.

రాత్రిపూట బయటకు రావాలంటే భయం

నరసింహారెడ్డి, చాపర్లపల్లి



గ్రామ జనాభాలో సగానికిపైగా బీసీ కాలనీలో ఉంటున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి డ్రైనేజీలోనే వస్తున్నాం. రాత్రిపూట బయటకు రావాలంటేనే భయంగా ఉంది. డ్రైనేజీలో పాములు, విషపురుగులు ఉండడంతో సాయంత్రం ఐదు గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నాం. దారి లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

కాలనీ అభివృద్ధికి చర్యలు చేపడతాం

సోనియాబాయి, ఎంపీడీఓ, మడకశిర

చాపర్లపల్లి బీసీ కాలనీకి రోడ్డు విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతాం.


కొట్టుకుపోగా మిగిలిన వరి పంటను చూసి, ఆవేదన చెందుతున్న రైతు తరిగోపుల బాబు

కన్నీళ్లే మిగిలాయి...

కళకళలాడిన పైరు..
కనిపించకుండా పోయింది..
పరుచుకున్న పసిరిక
పత్తాలేకుండా పోయింది..
కష్టం నీళ్లపాలైంది..
కన్నీళ్లు మిగిల్చింది..
ఆశల పంట..
ఒక్కరాత్రిలో కొట్టుకుపోయింది..
బంగారు పంటలు పండే పొలం..
బండరాళ్లతో నిండిపోయింది..
అన్నదాత గుండె పగిలిపోయింది..


తరిగోపుల బాబు, రైతు

ఈయన పేరు తరిగోపుల బాబు. కనగానపల్లికి చెందిన రైతు. రాళ్ల మధ్యలో తన ఆశలను, కష్టాన్ని వెతుకుంటున్నాడు. వ్యయప్రయాలకోర్చి సాగుచేసిన పైరును బండరాళ్ల కింద శోదిస్తున్నాడు. తరిగోపుల బాబు కనగానపల్లి చెరువు కట్ట కింద నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. పంట వెన్నుదశలో ఉండేది. నెలరోజులు ఆగితే చేతికొచ్చేది. భారీ వర్షం అతడి ఆశలను అడియాసలు చేసింది. వాన బీభత్సానికి కనగానపల్లి చెరువు కట్ట సోమవారం రాత్రి తెగిపోయింది. బాబు సాగుచేసిన పంట మొత్తం కొట్టుకుపోయింది. అతడి భూమిలో చెరువు కట్టకు వాడిన భారీ రాళ్లు వచ్చి పడ్డాయి. పంట పెట్టుబడి పాయె.. పొలమూ పాయె అంటూ రైతు రోదిస్తున్నాడు. భూమిని మళ్లీ సాగులోకి తెచ్చుకోవడం అంత సులువు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లోని కాలనీల ప్రజలకు అన్నివిధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అర్బన్ నియోజకవర్గం పరిధిలోని అనంతపురం రూరల్ పంచాయతీ రామకృష్ణకాలనీ, నారా లోకేశ్ కాలనీ, సుశీలరెడ్డి కాలనీ, తిమ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీల్లోకి వరదనీరు చేరింది. దీంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక నాయకులు, మండల అధికారులతో కలసి ఆయా కాలనీల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. ఇళ్లలోకి నీరు చేరి భారీగా నష్టపోయామని కాలనీ వాసులు ఆయనతో ఆవేదన వ్యక్తం చేశారు. అధైర్యపడ వద్దని ప్రభుత్వం అదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ..వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే అప్రమత్తం చేయడంతో నష్ట తీవ్రత తగ్గింద న్నారు. మరోవైపు బాధితులకు పునరావసకేంద్రాలు ఏర్పాటు చేసి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించినట్లు తెలిపారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది వరద ప్రభావిత కాలనీల్లో ఉంటారని, స్థానికులకు ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందిస్తారన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, టీడీపీ రాష్ట్ర నాయకులు జయరాంనాయుడు, సర్పంచు ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

● అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గం పరిధిలోని నాలుగు పంచాయతీల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్, హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఒక్కొక్క శాఖతో విడివిడిగా సమావేశమై శాఖల్లో చేపట్టాల్సిన పనుల గురించి ఆరా తీశారు. రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఇదే సందర్భంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులతో చర్చించారు. అలాగే ఇప్పటికే టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారని ఇది గత ప్రభుత్వం చేసిన తప్పిదమన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, పీఆర్ డీఈ లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, హౌసింగ్ డీఈ మధుసూదన్ రెడ్డి, ఏఈలు శివారెడ్డి, రాజేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్‌కు మతిభ్రమించింది

● జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గోరంట్ల మాధవ్‌కు మతిభ్రమించిందని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో సూపర్ సిక్స్ పథకాల అమలును ఓర్వలేని లెవెన్ రెడ్డి ఫాలోవర్ గోరంట్ల మాధవ్ అక్కసు వెళ్లగక్కుతున్నా రన్నారు. గోరంట్ల మాధవ్ మతిభ్రమించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి విమర్శలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

పూజారి కుటుంబాన్ని ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి లో భారీ వర్షం వలన పూజారి నారాయణప్ప కుటుంబానికి చెందిన 80 మేకలు మృతి చెందాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ సోమవారం బండమీదపల్లిలో పూజారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూజారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవా లన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పోతులయ్య పాల్గొన్నారు.

అండగా ఉంటాం

● మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి సల్లాపురమ్మ ఆలయ పూజారి కుటుంబానికి అండగా ఉంటామని మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆలయ పూజారి నారాయణప్పకు చెందిన 80 మేకలు నీటిలో మునిగి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన ఆ గ్రామానికి వెళ్లి పూజారి కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించారు. పంట నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, నాయకులు శ్రీనివాసులు, వెంకట్రాముడు, నారాయణ స్వామిపాల్గొన్నారు. అనంతరం అయ్యవారిపల్లి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పండమేరు వంకను పరిశీలించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ శివప్రసాద్

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా కోర్టు న్యాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గొరిదిండ్ల తండా గ్రామంలో మంగళవారం జిల్లా గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ... జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థల ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ అధికారి శంకరనారాయణ, తహసీల్దార్ కృష్ణానాయక్, ఎంపీటీసీ లక్ష్మినరసింహ, ఎంపిపి హేమలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

26 నుంచి ప్రథమ చికిత్సపై శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్సపై శిక్షణా సదస్సును ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సెక్రటరీ మోహన్‌కృష్ణ తెలిపారు. మూడు రోజుల పాటు రెడ్ క్రాస్ సొసైటీలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ఫ్యాక్టరీలలో పనిచేసే ఉద్యోగులు, ఆర్ఎంపీలు, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు, ఆసక్తి ఉన్న అభ్యర్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9849499788, 9390982098లను సంప్రదించాలని కోరారు.

ఫీజురీయింబర్స్‌పై నేడు ధర్నా

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలపై బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో కళాశాలలకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించాలని ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు.

పొలం పిలుస్తోంది

అనంతపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ నారాయణపురం పంచాయతీ నాగిరెడ్డిపల్లిలో వ్యవసాయాధికారులు మంగళ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శశికళ హాజరై వరి పంటకు వచ్చుతెగులు.. నివారణ గురించి రైతులకు తెలియజేశారు. మట్టి పరీక్ష ఫలితాల కార్డులు, కౌలురైతుల కార్డులను అందజేశారు. ఏపీఎంఐపీ అధికారులు, సెరికల్చర్ అధికారి ఓబులేసు, వెటర్నరీ అసిస్టెంట్ మురళీకృష్ణ, రైతు సేవ కేంద్రం సహాయకులు నాగలత పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం..!

● ఎమ్మెల్యే పరిటాల సునీత



ఉప్పరపల్లిలో వరద ప్రభావిత ప్రాంతాల వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి..అన్ని విధాలా ఆదుకుంటామని వరద ప్రభావిత ప్రాంతాల వారికి ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా ఇచ్చారు. మండలపరిధిలోని ఉప్పరపల్లిలోని వదర ప్రభావిత ప్రాంతాల్లో జేసీ శివ్‌నారాయణ్‌శర్మతో కలసి ఆమె మంగళవారంలోని పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న సహాయ చర్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అనుకోకుండా వచ్చిన వర్షాల కారణంగా భారీ నష్టం వాటిల్లిందని, పంటలు దెబ్బ తిన్న రైతులను ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. అధికారులంతా క్షేత్రస్థాయికి వెళ్లి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. ఇప్పటికే మంత్రుల దృష్టికి జరిగిన నష్టాన్ని తీసుకెళ్లామని తెలిపారు. అధికారులు తెల్లవారుజామున నుంచి క్షేత్రస్థాయిలో ఉండి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారని, అక్కడ వారికి అవసరమైన ఆహారం అందుబాటులో ఉంచారన్నారు. ఇంత పెద్ద ఎత్తున జరిగిన నష్టం వెనుక గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసులురెడ్డి, గోవిందు, జగదీష్, బాలరాజు, ముత్యాలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వదర ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలసి జగనన్న కాలనీని పరిశీలించారు. ఎస్పీ జగదీష్, ఇతర అధికారులతో విన్సెంట్ డీ పాల్ స్కూల్, ఆర్డీటీ స్టేడియం వద్ద బ్రిడ్జిపై పండమేరు ప్రవాహాన్ని పరిశీలించారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జేసీ

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేసీ శివనారాయణశర్మ తెలిపారు. మండలంలోని బండమీదపల్లి వద్ద వంకను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలను ప్రభుత్వం అదుకోవాలి

● టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య

గార్లదిన్నె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య కోరారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో వరి, వేరుశనగ, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఆయన మంగళవారం ఉదయం వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులతో కలసి పంటలను పరిశీ లించారు. వర్షానికి పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి: సీపీఐ

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం వలన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లికార్జున, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ పత్రికా ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు వెంటనే నష్టపోయిన రైతుల పొలాలు పరిశీలించాలన్నారు. పూజారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై శ్రద్ధ పెట్టండి

● కో-ఆర్డినేటర్లకు ఏసీ గోవింద్ నాయక్ ఆదేశం

అనంతపురం విద్య, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూళ్లలో అడ్మిషన్ల భారీగా పెంచాలని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషన్ గోవింద్ నాయక్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లను ఆదేశించారు. ఆయన మంగళవారం నగరంలోని పొట్టిశ్రీరాములు స్కూల్‌లో కో-ఆర్డినేటర్ల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ....ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు తీసుకోవచ్చన్నారు. అలాగే ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు రూ. 200 అపరాధ రుసుంతో అడ్మిషన్ల పొందవచ్చునని, రూ. 500 ఫైన్‌తో ఈ నెల 31 వరకు గడువు ఉందన్నారు.

ఐఆర్, సీపీఎస్ రద్దుపై కేబినెట్‌లో చర్చించాలి

అనంతపురం విద్య, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఐఆర్ ఇతర అంశాలపై బుధవారం జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ప్రధాన కార్యదర్శి డెగావత్ రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ వ్యవస్థీకరణ, మధ్యంతర భృతి, సీపీఎస్ రద్దు, చాలా వరకూ పెండింగ్‌లో ఉన్న డీఏ అంశాలను అజెండాలో చేర్చి చర్చించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీపి కబురు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. 11వ పీఆర్సీ ముగిసి 14 నెలలు గడుస్తున్నా... ఉద్యోగులకు ఎలాంటి భరోసా లేదన్నారు. సత్వరమే ఉద్యోగులకు మేలు జరుగుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. పెండింగ్ బకాయిలపై కూడా నిర్ణయం తీసుకుని ఉద్యోగ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

ట్రాక్టర్, బైకు ఢీ.. యువకుడి మృతి



భానుప్రకాష్‌రెడ్డి (ఫైల్)

నార్పల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట కాలనీ వద్ద మంగళవారం ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొని భానుప్రకాష్ రెడ్డి(19)అనే యువకుడు మృతి చెందాడు. నార్పలలోని సుల్తాన్ పేటకు చెందిన భానుప్రకాష్ రెడ్డి, సతీష్, ప్రణీత్ అనే ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంలో పని నిమిత్తం గూగూడుకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంలో గ్రామానికి తిరిగి వస్తుండగా సుల్తాన్‌పేట వద్ద నార్పలకు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో భానుప్రకాష్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, సతీష్, ప్రణీత్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108వాహనం ద్వారా అనంతపురం తరలించారు. మృతుడు భానుప్రకాష్‌రెడ్డి నార్పల సుల్తాన్‌పేట కాలనీకి చెందిన రామచంద్రారెడ్డి పెద్దకుమారుడు. ఇటీవలే చదువు మానేసి పొలం పనులు చూసుకుంటున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు భోజన సదుపాయం



భోజనం పొట్లాలు అందజేస్తున్న బంగి నాగ

అనంతపురం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పండమేరు వంక వరద ఉధృతికి అనంతపురం రూరల్ మండలం నారాలోకేశ్ కాలనీ నీటము నిగింది. దీంతో ఆ కాలనీ వాసులకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ ఆధ్వర్యంలో మంగళవారం భోజనం సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాకే ధను, వడ్డే రమణ, వేణు, చంద్ర, శ్రీరాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అనంతపురం అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం నారాయణపురం పంచాయతీ పరిధిలోని సోమనాథ్‌నగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యద ర్శి రాయల్ మురళీ ముఖ్యఅతిథిగా హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఇదే క్రమంలో పలువురితో సభ్యత్వం చేయించారు.

వీరశైవ లింగాయతులను ఓబీసీలో చేర్చాలి

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వీర శైవ లింగాయతులను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని టీడీపీ వీరశైవ లింగాయత్ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ సాంబశివుడు కోరారు. ఆ మేరకు మంగళవారం హైదరాబాదులో జరిగిన ఓబీసీ సమీక్షా సమావేశంలో జాతీయ ఓబీసీ కమిటీ చైర్‌పర్సన్ గణేష్ సింగ్‌కు జాతీయ ఓబీసీ కమిటీ సభ్యుడు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని..ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అసెంబ్లీలో తీర్మానం కోసం చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వీర శైవ సమాజం రాష్ట్ర సభ్యుడు బసవరాజు, వీరశైవ ఎంప్లాయీస్ యూనియన్ కోశాధికారి జిల్లా శివకుమార్ పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విలువల బడుల విద్యార్థుల నుంచి సేకరించిన రూ.20వేల చెక్కును కేరళ ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు వితరణ చేశారు. మంగళవారం త్రివేండ్రంలోని సచివాలయంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు కలిసి చెక్కును అందజేశారు. కాగా విద్యార్థిదశలోనే దాతృత్వం చాటుకున్న విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి పినరయి విజయన్ హర్షం వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ ఎంప్లాయీస్ హక్కుల సాధనే లక్ష్యం

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న రిజర్వేషన్ ఎంప్లాయీస్ సంక్షేమాన్ని గత వైసీపీ ప్రభుత్వం కాలరాసిందని, వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఆర్ఈఎఫ్ పనిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. ఆర్ఈఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రామ చంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణం, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమాదేవి హాజరయ్యారు. నూతన కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణ, నాగేశ్వరరావు, రాయలసీమ అధ్యక్షులుగా గోవిందరాజులు, జాయింట్ సెక్రెటరిగా ప్రశాంత్‌బాబు, జిల్లా సమన్వయకర్తగా సురేష్‌బాబుతో పాటు వివిధ కేడర్లలో పలువురిని నియమిస్తూ ఆయన ఉత్తర్వులు అందజేశారు.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎలెక్ట్రికల్ షాపు యజమాని మహిందర్‌పై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసులుకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీస్ స్టేషన్ కూతవేట దూరంలో ఉన్న షాపు వద్దకు ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి కొన్ని ఎలక్ట్రికల్ సామాన్లు కావాలని అడుగుతూ ఒక్కసారిగా క్యాష్ కౌంటర్‌లో ఉన్న వ్యక్తిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. షాపులో కొనుగోలు చేసిన ఆక్సా బ్లేడుతో దాడికి పాల్పడినట్లు తెలిపాడు. అంతలో స్థానికులు కొందరు గమనించి అక్కడికి రావడంతో దుండగులు వెళ్లిపోయినట్లు తెలిపాడు. కారుకు రెండు నంబర్లు ఉన్నాయని తెలిపాడు. పోలీసులు విచారించి తనపై దడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి, వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఓ మహిళ నగరంలో అదృశ్యమైంది. ప్రభుత్వాసుపత్రి నుంచి ఆమె తప్పిపో యింది. హిందూపురం మండలం తూము కుంటకు చెందిన అంజినమ్మ తన కుమా రుడికి కిడ్నీ ఫెయిల్ కావడంతో చికిత్స నిమిత్తం అనంతపురంలోని ప్రభుత్వాసుప త్రికి తీసుకొచ్చింది. ఈ క్రమంలో తల్లి అంజినమ్మ సోమవారం మధ్యాహ్నం సమయంలో అదృశ్యమైంది. ఈ ఘటనపై ఆమె కోడలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫి ర్యాదు చేసింది. అంజినమ్మ ఆచూకీ తెలిస్తే 9440796806 ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నగరంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆదర్శనగర్‌కు చెం దిన చిన్నయ్య స్థానిక హరికిరణ్ డాబాలో పనిచేస్తుంటాడు. అతడు సోమవారం రాత్రి పనిముగించుకుని వెళ్తూ హైవేలో రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం పియాలేరులో 25 కేసుల (2304) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను అనంతపురం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది మంగళవారం పియాలేరులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి ఇంటి వద్ద టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జాకీర్, కృష్ణారెడ్డి, జయనరసింహ, హెచ్‌సీ శివప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

టిప్పర్ల పట్టివేత

గార్లదిన్నె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరులో సోమవారం ఎర్రమట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తుం న్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో వాటిని పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వసతి గృహాల్లో మినీ లైబ్రరీలు

● దాతల సహకారంతో పుస్తకాల కొనుగోలు
● విద్యార్థుల్లో విద్యావికాసం పెంపునకు అడుగులు



గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న బీసీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన మినీ లైబ్రరీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ అధికారులు వసతి గృహాల్లోని విద్యార్థుల్లో విద్యావికాసాన్ని పెంపొందించేందుకు అడుగులు వేశారు. విద్యార్థుల్లో మేథోశక్తిని పెంపొందిచేందుకు విజ్ఞాన భాండాగారాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో మినీ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు 30కిపైగా బీసీ వసతి గృహాల్లో మినీ లైబ్రరీలనుఅందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాల ద్వారా జనరల్ నాలెడ్జ్ పెంపొందే అవకాశం ఉన్నట్లు సంక్షేమశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో బీసీ సంక్షేమశాఖ పరిధిలో 55 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. అందులో 8,288 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వసతి గృహాల్లో ఏర్పాటు చేస్తున్న మినీ లైబ్రరీలకు ఆ శాఖ అధికారులు, వార్డెన్లతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంలో పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. అందులో మొదటి పైలెట్‌గా నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న బీసీ వసతి గృహంలో దాదాపు 1000కి పైగా వివిధ రకాల పుస్తకాలను ఏర్పాటు చేశారు. వీటిలో పోటీ పరీక్షలు, నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, తెలుగు, ఇంగ్లీష్ టు తెలుగు డిక్షనరీలను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చదువుకోవడం విద్యార్థులకు అలవాటుగా మార్చాలని ఆ శాఖ అధికారులు వార్డెన్లకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల్లో జనరల్ నాలెడ్జ్ పెంచాలనే...



వసతిగృహాల్లోని విద్యార్థుల్లో జనరల్ నాలెడ్జ్, విద్యా వికాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో మినీ లైబ్రరీలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించాం. ఇందుకోసం రాష్ట్ర ప్రభు త్వం, డైరెక్టరేట్ నుంచి అనుమతులు తీసుకున్నాం. అధికారులు, వార్డెన్లు, దాతల సహకారంతో లైబ్రరీలను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు ఉపయోగపడే విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచాం. దాతలు ముందుకు వస్తే విద్యార్థు లకు మరిన్ని పుస్తకాలు అందించే అవకాశం ఉంటుంది.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓంశాంతినగర్, శ్రీనివాసపురం, నందలపాడు, రాయచూర్‌వీధి, సీపీఐ కాలనీ, అంబేద్కర్‌నగర్, విజయనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్న 14మందిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి వారిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి నుంచి రూ.2.19లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తర్వాత వారిని కోర్టుకు హాజరుపరిచామన్నారు.

యాడికి: మండలకేంద్రంలోనూ మట్కారాస్తున్న ఒకరిని అరెస్ట్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. స్థానిక చింతవనం సమీపంలో మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి అరెస్ట్ చేశామని, అతడి నుంచి రూ.3400 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్

గుత్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధికి చెందిన మంగేరమేష్ చర్మకార సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మంగళగిరిలో మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లా రాజారావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగే రమేష్ ప్రకటనలో తెలిపారు.

మూర్ఛతో విద్యార్థి మృతి


సాయిధనుంజయ (ఫైల్)

గుత్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ కళాశాలలో బీటెక్ విద్యార్థి సాయిధనుంజయ(22) మూర్ఛతో మృతి చెందాడు. యాడికి మండలానికి చెందిన పోలారంగస్వామి, నాగలక్ష్మి దంపతుల కుమారుడు సాయిధనుంజయ గేట్స్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఈసీఈ చదువుతున్నాడు. కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో అతడికి మూర్ఛ వచ్చింది. తర్వాత కొద్దిసేపటికి తేరుకుని హెచ్ఓడీ పర్మిషన్ తీసుకొని ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. కళాశాల గేటు వద్దకు రాగానే కింద పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు.

పీఎంజేజేబీవైను సద్వినియోగం చేసుకోండి

విడపనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజనను 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం నాయక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పీఎంజేజేబీవై పథకంలో సభ్యత్వం పొందటానికి వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ కలిగి ఉన్నవారు ఆ అకౌంట్ ద్వారా రూ.436ఇన్సూరెన్స్ కంపెనీ వారికి ప్రీమియం చెల్లించి సభ్యత్వం తీసుకోవాలన్నారు. సభ్యత్వం తీసుకున్న వారు ఏదేని ప్రమాదంలో మృతి చెందితే రూ.4లక్షలు పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

గుత్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలులోని జనరల్ బోగిలో ఈ నెల 20వ తేదీన ప్రయాణిస్తూ మృతి చెందిన మహిళ ఆచూకీ లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన షహానా జబేగంగా గుర్తించామన్నారు. ఈనెల 20న ఆమె గుల్బర్గా నుంచి రాయచూరులోని బంధువుల ఇంటికి రైలులో వెళ్తున్నారని, కాగా ప్రయాణంలోనే గుండెపోటుతో మృతిచెందిందని, గుత్తి స్టేషన్‌లో గుర్తించి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించామని అన్నారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

చల్లా గుణరంజన్‌రావుకు సన్మానం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులవుతున్న చల్లా గుణరంజన్‌రావుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ సన్మానం చేశారు. విజయవాడలో మంగళవారం చల్లాగుణరంజన్‌రావును ఆయన కలిసి శాలువా కప్పి, పూల మాల వేసి ఘనంగా సత్కరించారు.

గాలివాన బీభత్సం

● బ్రాహ్మణపల్లిలో 80 ఎకరాల్లో నేలకొరిగిన వరి
● రైతన్నలకు అపారనష్టం


బెళుగుప్ప మండలం బ్రాహ్మణపల్లిలో నేలకొరిగిన వరిపంటను చూపుతున్న రైతులు

బెళుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం గాలివాన బీభత్స సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. 25.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. దీంతో బ్రాహ్మణపల్లిలో ఈదురుగాలులకు 80 ఎకరాల్లో వరి పంట నేలకొరిగి అపార నష్టం వాటిల్లింది. కోనపురంలో టమాట పంట నీటమునిగిపోవడంతో కాయలు దెబ్బతిన్నాయి. దుద్దేకుంటలో 20 ఎకరాలలో మిరప పంట నీటమునిగింది. చేతికొచ్చిన పంటలు నాశనమయ్యాయని ఆయా రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరారు.

ఉప్పొంగిన వాగులు

డీ.హీరేహాళ్: సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి మండల వ్యాప్తంగా ఉన్న వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొన్ని ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు తెగిపోయాయి. కర్ణాటక పైతట్టు ప్రాంతంలో అధిక వర్షం కురవడంతో మండలంలోని బాదనహాళ్, కాదలూరు గ్రామాల నడుమ ఉన్న హగరినది భారీ నీటి ప్రవాహంతో ప్రవహించింది. ఇరు గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రైనింగ్ జాయింట్ కలెక్టర్ వినూత్న బాదనహాళ్ వద్ద ప్రవహిస్తున్న నదిని సందర్శించారు. ప్రమాదాలు జరగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వాగు ప్రవాహానికి సోమలాపురం గ్రామ సమీపంలో చెక్‌డ్యాం పూర్తిగా తెగిపోయింది. దానిని కూడా ట్రైనీ జేసీ పరిశీలించారు. తిరిగి ఇక్కడ చెక్‌డ్యాం నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ మొండి మల్లికార్జున, వీఆర్వో రఘు పాల్గొన్నారు.

తెగిన మాల్యం రహదారి

కణేకల్లు: మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మాల్యం రహదారి తెగింది. ఉరుములు, మెరుపులతో వర్షం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కురవడంతో వేదావతి హగరిలోకి భారీగా నీరు చేరుకున్నాయి. దీంతో నీటి ప్రవాహం పెరిగి వేదావతి హగరిలో ఉన్న మాల్యం రహదారి తెగిపోయింది. రాకపోకలు నిలిపివేశారు.

రోడ్డు జలమయం..

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో నింబగల్లుకు వెళ్లే రోడ్డు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి దాదాపు అర కిలో మీటర్ మేర నీటితో నిండి పోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. చిన్న పాటి వర్షం వచ్చినా ఈ దారి బురద మయంగా మారి కాలు పెట్టడానికి వీలు లేకుండా ఉంటోందని, వర్షాలు తగ్గిన అనంతరం ఈ దారికి బీటీ రోడ్డును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

● సచివాలయ ఉద్యోగులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా అధికారులు, ఉద్యోగులు ఉంటారన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలను విసుక్కోకుండా వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు చొరవచూపాలన్నారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి దుస్తులు, కొబ్బరినూనె, బూట్లు, హెల్మెట్లు తదితర సామగ్రిని అందించారు. తర్వాత చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని సూచించారు. ప్రస్తుతం అండర్‌డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని, బాగుచేయాలంటే అందరూ కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

● రెవెన్యూ గ్రామసభలో రైతుల వినతులు


తిమ్మాపురంలో వినతిపత్రాలు ఇస్తున్న రైతులు

కూడేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం, ఎంఎంహళ్లి గ్రామాల్లో మంగళవారం అధికారులు రెవెన్యూ గ్రామసభలను నిర్వహించారు. ఇందులో రైతులు పెద్దఎత్తున పాల్గొని తమ సమస్యల్ని విన్నవించారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో జరిగిన రీ సర్వేతో తమ భూములకు, రికార్డులకు పొంతన లేకుండా పోయిందన్నారు. ఇష్టారాజ్యంగా కొలతలు వేశారని, దీంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వాపోయారు. వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం భూసమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. రెండు గ్రామాల్లోనూ సుమారు వందకు పైగా అర్జీలు వచ్చాయని తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. రీ సర్వే డీటీ దబ్బర ప్రసాద్, మండల సర్వేయర్ ఆయిషాసిద్దికి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఇందులో రైతులు శశిభూషణ, వీరాంజినేయులు, రామచంద్ర మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూముల్లో సర్వే చేసి రాళ్లు పాతారని, దీంతో భూములు అమ్ముకోలేకపోతున్నామని, డ్రిప్ పథకం వర్తించడం లేదని, అడంగల్‌లో వివరాలు తప్పుల తడకగా వస్తున్నాయని వాపోయారు. ఇందుకు తహసీల్దార్ షర్మిల అర్జీలిస్తే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతులు భూ సమస్యలపై అర్జీలిచ్చారు. డివిజనల్ సర్వేయరు సుబ్రహ్మణ్యం, మండల సర్వేయరు ప్రభాకర్, వీఆర్వో ఆనంద్, సెక్రెటరీ ఉమాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కన్నతండ్రిని హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన నాగరాజును మంగళవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాయదుర్గం పట్టణానికి చెందిన బొమ్మన్న తన కుమారుడి భార్యను అవమానంగా మాట్లాడాడని, దీంతో కక్ష పెంచుకున్న కుమారుడు తండ్రిని హత్య చేశాడని విచారణలో తేలిందన్నారు. ఈనెల 19న బొమ్మన్న కర్ణాటకలోని పెదారగుడ్డం వద్ద మొక్కజొన్న పొలం చూసుకుని ఇంటికి బైక్‌పై తిరిగి వస్తుండగా సాయంత్రం ఐదు గంటల సమయంలో నాగరాజు మార్గంమధ్యలో ఆపి నా భార్యను ఇష్టానుసారంగా మాట్లాడుతావా అని ప్రశ్నించాడు. ఈ క్రమంలో వారిద్దరి నడుమ మాటామాటా పెరిగింది. ఆగ్రహానికి గురైన నాగరాజు వెంట తీసుకెళ్లిన కొడవలితో తండ్రిని మోకాళ్ల వద్ద రెండుసార్లు బలంగా నరికాడు. దీంతో బొమ్మన్న కింద పడిపోయాడు. తర్వాత హతమార్చిన నాగరాజు తండ్రికి యాక్సిడెంట్ జరిగిందని ఇంట్లో వాళ్లకి బంధువులకి ఫోన్ చేశాడు. మరుసటి రోజు తండ్రిని కుమారుడే హతమార్చాడని తెలిసింది. దీంతో నాగరాజు పరారీ అయ్యాడు. మృతుడి భార్య శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయదుర్గం సీఐ జయనాయక్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మెచ్చిరి రోడ్డులో చింతమానుల తోపు వద్ద ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నాగరాజు నేరం అంగీకరించినందున హత్యకు ఉపయోగించిన కొడవలిని పోలీసులు సీజ్ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు కూలి మృతి

గుమ్మఘట్ట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో మంగళవారం ఉదయం విద్యుదాఘాతంతో రైతుకూలి మారెన్న(55) మృతి చెందాడు. ఇంట్లో కరెంట్ సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఆయన నిచ్చెన సాయంతో ఎక్కి విద్యుత్ తీగలను సరి చేసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో విద్యుత్‌షాక్ తగలడంతో స్తంభం పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నీలావతి, కుమార్తె కావేరి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కూడేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలోని పీఏబీఆర్ కుడికాలువలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా పీడీ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. పూడికతీత, కంపచెట్లు తొలగింపు పనులు చేస్తుండటంతో పీడీ పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం కూడేరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధిసిబ్బందితో సమావేశమై పలు సూచనలు అందించారు. ఏపీఓ తులసీ ప్రసాద్, జేఈ రవికుమార్, టీఏలు వేణుగోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

రాయదుర్గం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటైంది. ఇందులో టాటా ఎలక్ట్రానిక్స్, కోజంట్ కంపెనీ ఈ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాయదుర్గం నియోజకవర్గం నుంచి 65 మంది నిరుద్యోగ యువతీయువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అందులో 51 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ లెటర్లను అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ హెచ్ఓడీ సోమ్లానాయక్, సివిల్ హెడ్ రామకృష్ణారెడ్డి, ఇంగ్లిష్ అధ్యాపకురాలు షబానా, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాకు 276మంది హాజరుకాగా అందులో 139మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాబ్‌మేళాలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఒకేషనల్ ఇన్‌ఛార్జ్ హరిప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నారాయణస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన హెచ్చెల్సీ గట్టుకు మరమ్మతులు

కణేకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి పెను ప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంబిగనూరు గ్రామంలోని 159 కిలోమీటరు వద్ద కాలువ కుడి గట్టు కుంగింది. విషయం తెలుసుకున్న హెచ్చెల్సీ అధికారులు మంగళవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, జేఈ నరేంద్రమారుతి తదితరులు పాల్గొన్నారు.

బీటీపీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

గుమ్మఘట్ట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వేదావతి హగరి ద్వారా వరదనీరు బీటీపీ రిజర్వాయర్‌కు పెద్దఎత్తున చేరుతోంది. దీంతో మంగళవారం సాయంత్రానికి 1652 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పూర్తిస్థాయి నీరు చేరేందుకు మరో మూడు అడుగులు మాత్రమే అవసరం ఉండడంతో ఏ క్షణంలోనైనా ప్రాజెక్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వేదవతి హగరి పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజలు.. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కూడేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. మండలంలోని ఉదిరిపికొండ తండాలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఇందులో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో గొడవలకు వెళ్లకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు. తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఓ తులసీప్రసాద్, ఈఓఆర్డీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్.. ఖబడ్దార్..

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సూపర్‌సిక్స్ పథకాలపై నోరు పారేసుకున్న వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఖబడ్దార్ అంటూ టీడీపీ నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమంపై, పథకాలపై మాట్లాడే నైతిక హక్కు గోరంట్లమాదవ్‌కు లేదన్నారు. తమ అధినేత చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదన్నారు. ఇకపై అలాగే మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీవో వినూత్న మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు వార్డులను, పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది నిర్వహించే రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ వసతులు, వైద్య సదుపాయం, వైద్యుల పనివేళలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎల్లవేళలా అందుబాటులో వుంటూ సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిరుత హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దె గ్రామ సమీపంలో కొండలో మంగళవారం చిరుత హల్‌చల్ చేసింది. పొలాల్లోకి వెళ్తున్న రైతులు చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఆ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల గాలించారు. చిరుత కానరాలేదు. అనంతరం వన్యమృగాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

చెన్నై ఐసీటీ అకాడమీతో ఒప్పందం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల చెన్నై ఐసీటీ అకాడమీతో అవగాహన ఒప్పందం(ఎంఓయు)చేసుకుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆయన చెన్నై ఐసీటీ అకాడమీ రీజనల్ ప్రతినిధి ప్రదీప్‌కుమార్, కళాశాల శిక్షణ అధికారి, కోఆర్డినేటర్ కూరపాటి రాకేష్, కంప్యూటర్ విభాగ అధిపతి నటరాజ్‌తో కలసి ఒప్పందం పత్రాలను మార్చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఎన్నో ఉపయోగకరమైన వర్క్ షాపులు, ఇంటర్న్‌షిప్ పొందవచ్చన్నారు. యువతకు సాధికారత నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యంగా ఈ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకే రోజు అన్నదమ్ముల మృతి

● కాశీపురంలో విషాదఛాయలు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు శ్రీనివాసులునాయుడు, గిరిధర్‌నాయుడు మంగళవారం ఒకే రోజున మరణించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాశీపురం గ్రామానికి చెందిన జటింగనాయుడుకు శ్రీనివాసులు నాయుడు, సత్తెన్న, గిరిధర్ నాయుడు ముగ్గురు కుమారులు. వారిలో సత్తన్న కిడ్నీ సమస్యతో ఐదేళ్ల క్రితం మరణించారు. ఇదిలా ఉండగా కొద్దిరోజుల నుంచి శ్రీనివాసులు నాయుడు కిడ్నీ సమస్యతో బాధపడుతూ అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే తమ్ముడు గిరిధర్‌నాయుడు నాలుగు రోజుల క్రితం గ్యాస్ట్రిక్ సమస్యతో అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. కాగా మంగళవారం తెల్లవారుజామున గిరిధర్ నాయుడు మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని కాశీపురానికి తీసుకొచ్చారు. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు నాయుడికి తమ్ముడు మృతి విషయం తెలియడంతో మధ్యాహ్నం సమయంలో ఆయన కూడా హఠాత్మరణం చెందాడు. అన్నదమ్ములిద్దరూ ఒకే రోజు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యే నివాళి


గిరిధర్‌నాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కాశీపురానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గిరిధర్‌నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆ గ్రామానికి చేరుకుని గిరిధర్‌నాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబాన్ని పరామర్శించారు.

బీటీపీకి నిధులు కేటాయించండి: ఎమ్మెల్యే


మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ప్రాంత ప్రజలకు జీవనాడి అయిన భైరవాని తిప్ప ప్రాజెక్టు (బీటీపీ)కు హంద్రీనీవా నీళ్లు తీసుకెళ్లేందుకు కాలువలు తవ్వాలని, అందుకు సంబంధించిన పనులకు, అలాగే కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలో మంగళవారం ఆయన.. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీటీపీ పనులు త్వరగా ప్రారంభం అయ్యేందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ముత్తినేని రాజగోపాల్ ఉన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

విడపనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుహాసిని, ఉరవకొండ సీఐ రవిచంద్ర మంగళవారం తెలిపారు. మండలంలోని హావళిగి పాత చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టామని, అర్ధరాత్రి సమయంలో పాల్తూరు గ్రామానికి చెందిన వన్నూరు స్వామి, బొమ్మనహాళ్ మండలం గోవింద వాడకు చెందిన అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనాలపై కర్ణాటక మద్యం తరలిస్తూ కనిపించారని, వెంటనే వారిని పట్టుకుని అరెస్టు చేశామని చెప్పారు. అలాగే వారి 480 టెట్రా మద్యం ప్యాకెట్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తర్వాత ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వీరస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

తాడిపత్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరురోడ్డులో సోమవారం రాత్రి నాటుసారా విక్రేత శ్రీరాములును అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి 73నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. గుంతకల్లు మండలం గుండాల గ్రామానికి చెందిన శ్రీరాములు తాడిపత్రిలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సాయంత్రం వేళల్లో నాటుసారా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో దాడిచేశారన్నారు. నిందితున్ని కోర్టుకు హాజరుపరచగా 15రోజులు రిమాండ్ విధించిందని ఆయన తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగ

పుట్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డిపల్లి గ్రామశివారులో ఉన్న చౌడమ్మ ఆలయంలో హుండీ చోరీ చేసిన నిందితున్ని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా వీడియో ఆధారంగా దొంగను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కాజేసిన సొమ్ముపై తమదైన శైలిలో విచారించారు. నిందితుడు పుట్లూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

ఇరువురి అరెస్టు..

గుంతకల్లు టౌన్: పట్టణంలోని ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ మంగళవారం తెలిపారు. స్థానిక షికారి కాలనీకి చెందిన సుంక అలియస్ పప్పు, కల్లూరు గ్రామానికి వడ్డె జగదీష్ ఎనిమిది నెలల కిందట కథల గేరిలో ఓ ఇంట్లో, హనుమేష్ నగర్‌లో ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారిని కొనకొండ్ల రోడ్డులోని హనుమాన్ సర్కిల్ రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి ఆరు తులాల బంగారు నగలు, 15తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుట్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంటకు చెందిన కేశవనాయుడు బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో గాయాలయ్యాయని మంగళవారం పోలీసులు తెలిపారు. కేశవనాయుడు పనినిమిత్తం బైక్‌లో తాడిపత్రికి వెళుతుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అనంతరం బెంగళూరు తరలించారు. కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.